నేడు ప్రజావాణి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎనిమిది డివిజన్లకు సంబంధించిన ప్రజలు తమ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ, మంచినీరు, ఇతర సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగద్గిరిగుట్ట: విద్యుత్ మరమ్మతుల కారణంగా జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాధాకిషన్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజీవ్ గృహకల్ప, షిర్డీ హిల్స్, భూదేవి హిల్స్, కూన మహాలక్ష్మి నగర్, అంజయ్య నగర్ సీ బ్లాక్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జగద్గిరిగుట్ట, బీరప్పనగర్, అంజయ్యనగర్, మైసమ్మ నగర్, సోమయ్య నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ రాజేందర్‌తో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

దుండిగల్: డబుల్ బెడ్‌రూం సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలోని డబుల్ బెడ్‌రూం సముదాయాలు 3, 5, 8 బ్లాకుల వద్ద బోర్లు వేయాలని లబ్ధిదారులు ఆదివారం కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఎంపీ.. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బోర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, కాలనీ వాసులు గణేష్, మధు, శ్రీనివాస్, లత, జయమ్మ, ఆర్‌పీ లక్ష్మి, హసీనా, రఫ్రీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ రజతోత్సవాలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని రేణుకా ఎల్లమ్మ దేవి రజతోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహదేవ్, పెరిమాల రవి, నర్సింగ్‌రావు, సురేష్, పెరిమాల రాకేష్, చిత్తారమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్, ఇంద్రసేనారెడ్డి, బాలరాజ్, చౌడ శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లో 14 టిప్పర్లు సీజ్

28 మందిపై కేసు నమోదు



ఇటీవలే సీజ్ చేసిన టిప్పర్(ఫైల్)

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో మట్టి పోసి చదును చేయడంపై రెవెన్యూ, హైడ్రా సీరియస్‌గా తీసుకుంది. గడిచిన 45 రోజుల్లో గాజులరామారం సర్వే నంబర్ 307, జగద్గిరిగుట్ట సర్వే నంబర్ 348 ప్రభుత్వ స్థలాల్లో రాత్రి వేళలో గుట్టు చప్పుడు కాకుండా మట్టి పోస్తున్న 14 టిప్పర్లను రెవెన్యూ, హైడ్రా అధికారులు జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో సీజ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో మట్టి నింపుతున్న టిప్పర్ ఓనర్లు, డ్రైవర్లు కలిపి 28 మందిపై కేసులు నమోదు చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులామ్ కలీం తెలిపారు. ప్రభుత్వ స్థలంలో మట్టి పోసి కబ్జాలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. సెలవు దినాల్లో, రాత్రి వేళల్లో సైతం నిఘా ఉంచినట్లు తెలిపారు.

సౌకర్యాల లేమితో మోడ్రన్ ఫంక్షన్ హాల్

● వసతులు లేక అధ్వానంగా కల్యాణ మండపం ● పైపులైన్ వ్యవస్థ లేక వృథాగా నీరు ● పట్టించుకోని అధికారులు

కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్ సౌకర్యాల లేమితో అధ్వానంగా మారింది. ప్రారంభంలో సౌకర్యాలు ఉన్నా రాను రాను అధికారుల నిర్లక్ష్యంతో సరైన నిర్వహణ లేక అటకెక్కింది. సరైన వాష్ బేషిన్, మరుగుదొడ్లు, నీటి వసతి లేక ఫంక్షన్‌హాల్‌లో ఫంక్షన్ చేయడానికి ముందుకు రావడం లేదు. కేవలం శుభ కార్యాలు ఉన్నప్పుడే ఏదో అలా శుభ్రం చేసి అప్పగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

చింతల్: పైన పటారం లోన లోటారం అన్న చందంగా మారింది చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్. సుమారు రూ. 4.70 కోట్ల నిధులతో ఈ ఫంక్షన్ హాల్‌ను నాటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వంటశాల, వాష్ బేషిన్లు, టాయిలెట్లు లేక ఫంక్షన్‌కు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నీటి అవసరమై బోరును స్టార్ట్ చేస్తే.. అవి నేరుగా నల్లాలు లేని వాష్ బేషిన్‌ల ద్వారా నీరంతా వృథాగా పోతుంది. రోడ్లపై పారుతున్నా పట్టించుకునే వారే లేరు.

అపరిశుభ్రంగా టాయిలెట్లు

ఫంక్షన్‌హాల్‌ను 2016 లో ప్రారంభించి 2022 నుంచి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఒక రోజుకు రూ.18,800, సగం రోజు శుభకార్యాలకు రూ.9400 చొప్పున జీహెచ్‌ఎంసీ పేరు మీద డీడీలు తీసి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు ఇవ్వాలి. డీడీలు తీసుకున్న యంత్రాంగం టాయిలెట్లు, వాష్‌బేషన్లను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో శుభకార్యాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఎక్కడో కొంత దూరం ప్రాంతాలకు వెళ్లడం లేదా ప్రధాన రోడ్డుపై ఉన్న పే అండ్ యూస్ టాయిలెట్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రెండేళ్లుగా అనేక శుభకార్యాలకు డీడీలు చెల్లించుకున్న అధికారులు టాయిలెట్లను శుభ్రం చేసే పనిని మర్చిపోయారు. అదేవిధంగా వాష్ బేషిన్‌లకు నల్లాలు లేకపోవడంతో శుభకార్యం ప్రారంభం నుంచి ముగిసేంత వరకు నల్లాలు లేని పైపుల ద్వారా నిరంతర వృథాగా పోతుంది.



ఫంక్షన్ హాల్‌కు తాళాలు వేయకుండా వదిలేసిన ప్రధాన గేటు



నల్లాలు లేకుండా ఉన్న హ్యాండ్‌వాష్ ప్రాంతం



అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లు

అక్రమ పార్కింగ్‌కు నిలయంగా

కల్యాణ మండపంలో శుభకార్యం పూర్తికాగానే జీహెచ్‌ఎంసీ సిబ్బంది కిటికీలు, తలుపులు మూసివేసి ప్రధాన ద్వారంతో పాటు ప్రహరీ గోడకు ఉన్న గేటుకు తాళాలు వేయాల్సి ఉంది. తాళాలు వేయకపోవడంతో కల్యాణ మండపం ఆవరణలోని ఖాళీ స్థలం అక్రమ పార్కింగ్‌కు నిలయంగా మారింది. చిన్నారులు క్రికెట్ ఆడే సమయంలో బాలు తగిలి ఇప్పటికే మండపానికి ఉన్న అద్దాలు పగిలాయి. అయినా అధికారులు వాటికి ఎటువంటి మరమ్మతులు చేయించకపోవడం వారి పనితీరుకు నిదర్శనం.

శుభ్రం చేసి ఇస్తున్నాం

భగత్‌సింగ్ నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండప నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పటి వరకు ఏ ఏజెన్సీకి అప్పగించలేదు. శుభకార్యాలు జరిగే ముందు రోజు తమ సిబ్బందితో శుభ్రం చేయించి నిర్వాహకులకు అప్పగిస్తున్నాం. మరల మరో శుభకార్యం వచ్చినప్పుడు శుభ్రం చేయడం కారణంగా అవి కొంతమేర దుర్భరంగా తయారవుతున్నాయి.

– నాగరాజు జీహెచ్‌ఎంసీ సైట్ ఇంజినీర్

కల్యాణం.. కమనీయం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లోని పద్మావతి గోదాదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.. ఆదివారం ఉదయం 8 గంటలకు ద్వారతోరణం, ధ్వజకుంభారాధన, చతుఃస్థానార్చన, నిత్య పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. సాయంత్రం 5.30 గంటలకు సామూహిక విష్ణుసహస్ర పారాయణం, ద్వార తోరణ పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. ఎంపీ ఈటల రాజేందర్ దర్శించుకుని పూజలు చేయగా.. ఆలయ కమిటీ ఆయనను సత్కరించింది. సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీసుదర్శనరసింహ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఆశీర్వాదం తీసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్

వైభవంగా పోచమ్మ తల్లి ఆలయ వేడుకలు



నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్1లోని పోచమ్మ తల్లి ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



చింతల్: మానవసేవే మాధవసేవ అని ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆక్యుపంచరిస్ట్ రాధిక అన్నారు. ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్, ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌కుష్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగింది. 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

రాణా ప్రతాప్‌నగర్‌లో వసతులు కల్పిస్తాం

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కార్పొరేటర్ సబిహా బేగం సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మాధవాచారి, ప్రధాన కార్యదర్శిగా సాంబయ్య, కోశాధికారిగా శ్యామ్ సుందర్ రెడ్డి, చైర్మన్‌లుగా రవీందర్ గౌడ్, లింగం, వైస్ ప్రెసిడెంట్‌గా రాజయ్య చారి, బాబా, శంకర్, గపూర్, జాయింట్ సెక్రటరీలుగా ఆకుల అనిల్ కుమార్, జహంగీర్ బాబా, నిజాం, ఉమర్, కిష్టారెడ్డి ఎన్నికయ్యారు. రాణా ప్రతాప్ నగర్‌లో నూతన బోర్ వాటర్ కోసం మోటార్ బిగించామని కార్పొరేటర్ తెలిపారు. మిగిలిన పెండింగ్ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లికార్జున్, రాంరెడ్డి, యోగి, పార్వతమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని షిరిడీ హిల్స్ శ్రీసాయి రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఇటీవలే ముగిశాయి. అధ్యక్షుడిగా బండా మహేందర్, జనరల్ సెక్రటరీగా దినేష్, ట్రెజరర్‌గా వినోద్ యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం గెలుపొందిన వారు ప్రమాణ స్వీకారం చేసి నియామక పత్రాలు అందుకున్నారు. కాలనీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభానికి సిద్ధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ లేడీస్ హాస్టల్‌లో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ ప్రారంభానికి సిద్ధమైంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహకారంతో ఖేలో ఇండియా నిధులలో రూ.5 కోట్లతో నూతన స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న కొత్త స్విమ్మింగ్ పూల్‌ను వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు సమాచారం.

1న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

కుత్బుల్లాపూర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఐఎన్‌టీయూసీ నేత చింతల నాగరాజు అన్నారు. మార్చి 1వ తేదీన జరిగే రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు హాజరు కావాలని కోరుతూ ఆదివారం బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు గూడ ఐలయ్యగౌడ్, దళిత సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు అమర్ బాబు, దళిత సేన జాతీయ అధ్యక్షుడు జేమ్స్ ఆధ్వర్యంలో నాగరాజును కలిసి సదస్సుకు ఆహ్వానించారు. కార్యక్రమంలో బహుజన సేన అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



నాగరాజుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఐలయ్యగౌడ్, జేమ్స్ తదితరులు

ఎస్‌టి మాథ్యూస్ చర్చి ప్రారంభం



కుత్బుల్లాపూర్ : సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ పరిధిలోని షాపూర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఎస్‌టి మాథ్యూస్ చర్చిని ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కె అనిల్ కుమార్, 130 డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి, సల్మాన్ రాజ్, భాస్కర్ రెడ్డి, గొల్ల జాన్, రోషన్, నర్సింహారెడ్డి, శ్యామ్, చారీ, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



కంకర తేలిన రోడ్డు.. మరమ్మతులు ఎప్పుడు?

జీడిమెట్ల: జీడిమెట్ల నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డులో అపురూపాకాలనీ క్రాసింగ్ వద్ద రోడ్డు మొత్తం కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించే క్రమంలో వాహనాలు గుంతల్లో పడి మరమ్మతులకు వస్తున్నాయని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఏ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమం కోసమే పనిచేయాలని బీఆర్‌ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ జయరామ్‌నగర్‌లో రూ.90 లక్షలతో పూర్తిచేసిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని, ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుంటి మల్లేష్, ప్రధాన కార్యదర్శి మన్నే హరినాథ్, ఉపాధ్యక్షుడు లింగ భిక్షపతి, చైర్మన్ నరసింహ, కోశాధికారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

◆ గాజులరామారం మెట్‌కానిగూడలోని మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ ఆయా డివిజన్‌ల అధ్యక్షులు విజయరామిరెడ్డి, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకుడు కస్తూరి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

నిజాంపేట్ : కమిటీ సభ్యులు కలిసికట్టుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం 191 ఎన్టీఆర్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రెసిడెంట్‌గా రెడ్డిపల్లి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మి, కాలప్ప, జనరల్ సెక్రటరీగా దేవరాజ్, ఉదయ్, ప్రచార కార్యదర్శిగా కోటేష్ యాదవ్, ప్రవీణ్‌చారి, కోశాధికారిగా మోహన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగుల మధుసూదన్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ ఆవుల రాము యాదవ్, మోరంపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28 వరకు కులగణన వివరాల నమోదు

దుండిగల్: ఇప్పటి వరకు కుల గణన చేసుకోని వారి కోసం మరోసారి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు కుల గణన సర్వే ఉంటుందని, గతంలో చేసుకోలేని వారు ఈ దఫా వినియోగించుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్, ఆన్ లైన్ ఫీల్డ్ సర్వే ఫాం, ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్ ద్వారా అయినా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇందు కోసం మున్సిపల్ ఆఫీస్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజా పాలన సేవా కేంద్రం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

నిజాంపేట్ : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం 20వ డివిజన్ ఇంద్రానగర్ కాలనీ ప్రజలు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. రోడ్డు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన.. త్వరలోనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హర్యానాయక్, వెంకట్‌రెడ్డి, చాంద్‌పాషా, కె.కృష్ణ నాయక్, కె.బాబు నాయక్, మున్నార్ పాషా, కె.రమేష్‌నాయక్, స్వామినాయక్, బాలమ్మ, కె.రాజునాయక్, బలరామ్‌నాయక్, కె.హేమానాయక్, ఎం.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు వివరిస్తున్న ప్రజలు

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



ఉమేష్‌కుమార్

సికింద్రాబాద్: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెం. 2లో శనివారం అర్ధరాత్రి మధ్యప్రదేశ్‌లోని అనుపూర్‌కు చెందిన ఉమేష్ కుమార్(22) ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి..



శ్రీధర్

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. తార్నాకకు చెందిన గాజుల శ్రీధర్(51) లాలాగూడ రైల్వే వర్క్‌షాప్‌లో సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మౌలాలి – చర్లపల్లి రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెత్తకు నిప్పు.. అలుముకున్న పొగలు



కుత్బుల్లాపూర్: ఆకతాయిలు ఖాళీ స్థలంలో చెత్తాచెదారాలకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ వ్యాపించింది. జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో సుమారు 4000 గజాల ఖాళీ స్థలం ఉండగా.. ఆదివారం మధ్యాహ్నం దట్టమైన పొగలు, మంటలు రావడంతో కాలనీవాసులు కంగారు పడ్డారు. వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో సకాలంలో వారు చేరుకొని మంటలను ఆర్పించారు.